క్లుప్తంగా

రాయితీపై గడ్డి జొన్నలు

కొనకనమిట్ల: పశు పోషకులకు అవసరమైన గడ్డి జొన్నలను 75 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు కొనకనమిట్ల పశు వైద్యాధికారి అమూల్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1500 కిలోల గడ్డి జొన్నలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు తర్లుపాడులో విద్యుత్‌కు అంతరాయం

తర్లుపాడు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ హనుమానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు సచివాలయాల్లో ఆధార్ క్యాంపు

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ 2, కోలభీమునిపాడు సచివాలయాల్లో మంగళవారం ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తోట చందన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

మార్కాపురం టౌన్: ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలు ఆధార్ సేవలను వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్ సూచించారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రఫిక్ అప్‌డేట్స్ ఉచితంగా చేసుకోవచ్చని, రూ.100 చెల్లించి బయోమెట్రిక్ అప్‌డేట్, రూ.50 చెల్లించి డెమోగ్రఫిక్ అప్‌డేట్, రూ.30 చెల్లించి ఆధార్ డౌన్‌లోడ్ ప్రింటింగ్ కాపీని పొందవచ్చని వివరించారు. సచివాలయం–5 పరిధిలో ఈనెల 23 నుంచి 24 వరకు, సచివాలయం–18 పరిధిలో 25 నుంచి 26 వరకు, 27న పూలసుబ్బయ్య కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ శరత్

మార్కాపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బి శరత్ సూచించారు. సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ విద్య కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వ ఉంటే డెంగీ, మలేరియా కారక దోమలు వృద్ధి చెందే ప్రమాదముందన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు చక్కిలం శ్రీధర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు ఏనుగుల రవికుమార్, వెంకటరావు, విప్లవకుమార్, నందగోపాల్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



గొట్లగట్టులో మాట్లాడుతున్న ఏఓ

కొనకనమిట్ల: భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు కౌలు కార్డులు అందజేస్తామని స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని గొట్లగట్టు, నాగంపల్లి, చినమనగుండం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో కౌలు రైతులకు సమావేశం నిర్వహించి కౌలు గుర్తింపు కార్డు యొక్క వివరాలు రైతులకు వివరించారు. వీఆర్వోలు, వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఆర్ఓ దిలీప్‌కుమార్, వీఏఏలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్



లింగారెడ్డికాలనీలో చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తర్లుపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. లింగారెడ్డికాలనీలో హెచ్ఎం మౌలాలి అధ్యక్షతన జాతీయ నూతన విద్యావిధానంపై అవగాహన కల్పించారు. టీఎల్ఎమ్ ప్రదర్శనతోపాటు విద్యార్థులు రూపొందించిన చార్టులపై అవగాహన కల్పించారు. ఏడు రోజులపాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఇదిగో సారూ.. పట్టించుకోండి ఓ మారు!

- మార్కాపురం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రజల ఆశలు
- వెలుగొండ ప్రాజెక్టుకు శ్రీశైలం నీటిని విడుదల చేయాలి
- మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలి
- మార్కాపురం, పొదిలిలో తాగు నీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి



మార్కాపురం వ్యూ

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. నూతన ప్రభుత్వ తొలి అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి గళం విప్పి నిధులు రాబట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 2,12,070 ఓటర్లు ఉన్నారు. మార్కాపురం మున్సిపాలిటీగా, పొదిలి నగర పంచాయతీగా ఉంది. వీటితోపాటు మార్కాపురం రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో ఇప్పటికీ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో 55,305 మంది ఓటర్లు ఉండగా సుమారు 80 వేల మందికి పైగా ప్రజలు నివశిస్తున్నారు. ప్రస్తుతం ఐదారు రోజుల కొకసారి నీటి సరఫరా జరుగుతోంది. గత ప్రభుత్వంలో రెండో దశ సాగర్ పైపులైన్ల నిర్మాణం, పట్టణంలోని 7 వార్డుల్లో నూతన పైపులైన్ల ఏర్పాటుకోసం ప్రభుత్వం 25 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. దీనితోపాటు పొదిలిలో ప్రజల శాశ్వత నీటిసమస్య పరిష్కారం కోసం సాగర్ నీటి సరఫరా కోసం 55 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని వేగంగా పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కాపురం చెరువులో పూడిక తీయడంతోపాటు చెరువుకట్టను డబుల్ రోడ్డు(మినీ ట్యాంకు బండ్)గా ఏర్పాటు చేయడం, పొదిలి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణం, పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు, మార్కాపురంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

బేస్తవారిపేట: టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించే సమయంలో అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

- సగిలేరు సప్లయి చానల్ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాలు పడినప్పుడు శ్రీనివాస సినిమా హాలు, పాతాలనాగేశ్వస్వామి ఆలయ పరిసరాల్లోకి నీరు చేరుతుంది. గృహాల్లోకి నీరు చేరడంతో గిద్దలూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- రాచర్లగేట్ సెంటర్‌లో ఫ్లయిఓవర్ లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఫ్లయి ఓవర్ ఏర్పాటు చేస్తామన్నారు.
- గిద్దలూరు పట్టణ వాసులకు శాశ్వత మంచి నీటి సమస్య పరిష్కారం కోసం రామన్న కతువ నుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.
- నిరుద్యోగాన్ని తగ్గించేందుకు, వలసలను ఆపేందుకు వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడం, పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానన్నారు.
- వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు.
- నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడం, గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.
- సొంత మండలమైన కొమరోలు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.
- కంభం చెరువును పర్యటక కేంద్రంగా తీర్చిద్దిడం, యువతకు ఇండస్ట్రీలు ఏర్పాటు జరుగుతుందని కూటమి నాయకులు బహిరంగ సభలో హామీ ఇచ్చారు.
- నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధి, మరమ్మతులు చేయించడం
- ఇవే కాకుండా కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి మహిళలు, యువతకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 25 హామీలు ఇచ్చారు.

వెలుగొండను పూర్తిచేయాలి



వెలుగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేయడంతోపాటు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ముంపునకు గురవుతున్న గ్రామాల రైతులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పునరావాస కాలనీలను ప్రభుత్వం వెంటనే నిర్మించాలి. వెలుగొండ నీరు వస్తేనే ఈ ప్రాంతంలో కరువు పోతుంది. అప్పటి వరకు నీటి సమస్యను ఎదుర్కోవాల్సిందే. ప్రభుత్వం వెలుగొండపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రస్తుతం నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించాలి.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నేత

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి



మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. గత ఎన్నికల ప్రచారంలో మార్కాపురం, పొదిలిలో జరిగిన బహిరంగ సభల్లో చంద్రబాబునాయుడు ఆయన తనయుడు లోకేష్ తాము అధికారంలోకి వస్తే జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని వెంటనే అమలు చేయాలి. జిల్లాగా ఏర్పాటైతేనే పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందుతుంది. ఈ మేరకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టాలి.

– సుదర్శన్, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్

మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి



మార్కాపురం మండలం రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ఈ ప్రభుత్వం త్వరగా పూర్తిచేస్తే ఉపయోగంగా ఉంటుంది. దీని వలన వైద్యపరంగా పశ్చిమ ప్రకాశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుంది. ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. జీజీహెచ్‌కు కూడా నిధులు కేటాయించి రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. మార్కాపురం చెరువు కట్టను డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేయాలి.

– డీకేఎం రఫీ, సీఐటీయూ జిల్లా నాయకులు

ఉద్యోగులకు లీవ్ పొజిషన్ కల్పించాలి



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న సంఘం సభ్యులు

పొదిలి: ఉద్యోగుల హక్కు అయిన లీవ్ పొజిషన్ సక్రమంగా అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారంతో ఎనిమిదో రోజుకు చేరాయి. సోమవారం డిపో కోశాధికారి ఎస్‌కె.జిలానీ ఆధ్వర్యంలో బాజీ, మంగపతి, టీకే రావు దీక్షలో కూర్చున్నారు. యూనియన్ నాయకులు ఇ.బ్రహ్మయ్య దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షకు మద్దతు తెలిపిన నాయకులు మాట్లాడుతూ.. డిపోలో ఉన్న ఉద్యోగులను ఎక్సెస్ పేరుతో కనిగిరి డిపోకు బదిలీ చేయడంతో స్థానిక డిపో ఉద్యోగులకు పని భారం ఎక్కువైందన్నారు. కనిగిరి డిపోకు రిలీవింగ్‌పై పంపిన వారిని వెంటనే మాతృ డిపోకు తీసుకురావాలని, వార్షిక ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల పట్ల పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్న డిస్పాచ్ మెకానిక్ కృష్ణను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డిపోలో అవకతవకలను ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లినా కనీస విచారణ కూడా లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ బాలసుందరరావు



కంభం సీఐ రామకోటయ్య

- ఆటో డ్రైవర్లకు డీఎస్పీ హెచ్చరిక

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బాలసుందరరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ నుంచి రాత్రి వేళ పట్టణంలోకి వచ్చే ఆటో డ్రైవర్లు ఎక్కువ మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, ఇక మీదట అలాంటి ఫిర్యాదులొస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని, వేగ నియంత్రణ పాటించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆటో డ్రైవర్లకు పలు సూచనలిచ్చారు.

వాహనాలపై రవాణ శాఖ నంబర్ ప్లేట్లు మాత్రమే ఉండాలి

కంభం: ద్విచక్ర వాహనం, కార్లు, ఆటోలపై రవాణ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీఓ ఇచ్చిన నంబర్ ప్లేట్ మాత్రమే ఉండాలని, నంబర్ ప్లేట్ కనబడకుండా ఎలాంటి గుర్తులు, చిహ్నాలు లేదా ఫలానా వారి తాలూకా అని వేయించుకోకూడదని కంభం సీఐ జె.రామకోటయ్య అన్నారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించకున్నా, మద్యం తాగి వాహనం నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం, పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందాలు వంటివి జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఫోన్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు ఇతరులకు చెప్పకూడదన్నారు. సోషల్ మీడియాలో ఒక వ్యక్తిని గానీ, ఒక పార్టీని లేదా వర్గాన్ని రెచ్చగొట్టేలా అనుచిత పోస్టులు పెడితే పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ శాంతిభద్రతలు పరిరక్షించేందుకు తోడ్పడాలని కోరారు.

ఆన్‌లైన్ మోసగాళ్లతో జాగ్రత్త



మార్కాపురం టౌన్: సైబర్ నేరగాళ్ల మాయలో పడి ప్రజలు మోసపోవద్దని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఆర్టీఓ ఇచ్చిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. నంబరు ప్లేట్లపై నాయకుల ఫొటోలు, పేర్లు, ఫలానా వారి తాలూకా అని రాస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మెసేజ్‌లలో వచ్చే వెబ్ లింకులు ఓపెన్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని, మోసపోయినట్లు గ్రహిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆధార్, ఫోన్ నంబర్ తీసుకోకుండా పాత బంగారం కొన్నట్లయితే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కేజీబీవీని పరిశీలించిన ఎంఈఓలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం ఎంఈఓలు ఎస్‌కె.డాంగేషరీఫ్, బి.నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాడు–నేడు కొంత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, లైబ్రరీ, పాఠశాల గదులు, వాటర్ ప్లాంట్, టాయ్‌లెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

పొదిలి: పొదిలి సర్కిల్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కోటయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గోగినేనివారిపాలెం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న రాయవరం గ్రామస్తులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు మండలంలోని రాయవరం గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ రైతు సంఘం నేత గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. రాయవరంలో సుమారు 100 మంది పేదలు ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్నారని, వారికి వెంటనే పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు మంజూరు చేయాలని వెంకటరామిరెడ్డి కోరారు. అలాగే పెద్దోదోర్నాల మండలం ఐనముక్కల గ్రామానికి చెందిన చిట్టాల హరిప్రియ, ఆమె భర్త వేణుగోపాల్ రెడ్డి తమకు వారసత్వంగా వచ్చిన పొలాన్ని పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కబ్జాచేసి సాగు చేసుకుంటున్నాడని, న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. పెద్దారవీడు మండలం పోతంపల్లి గ్రామానికి చెందిన పలువురు దళితులు తమకు అసైన్‌మెంటు చట్టప్రకారం భూమితోపాటు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు మీకోసం కార్యక్రమానికి హాజరై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు.

కౌలుకార్డులతో ప్రభుత్వ పథకాల వర్తింపు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి జక్కం మెర్సీ

బేస్తవారిపేట: కౌలురైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందడంతో ప్రభుత్వం అందించే పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. సోమవారం మండలంలోని జేబీకే పురంలో కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు, సబ్సిడీపై విత్తనాలు, ఇన్‌ఫుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతులకే వర్తిస్తుందన్నారు. కౌలు కార్డులు దరఖాస్తు చేసుకోవడానికి భూమి యజమానితో అగ్రిమెంట్, 1బీ, ఆధార్ కార్డు తీసుకుని వీఆర్వోకు అందజేయాలని కోరారు. సర్పంచ్ కంచర్ల వెంకట లక్ష్మమ్మ, వీఆర్వో, వీఏఏలు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంను ఉపయోగించి బోధించాలి



టీఎల్ఎం ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈఓలు

బేస్తవారిపేట: విద్యార్థులకు తప్పనిసరిగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగించి బోధించాలని ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఏర్పాటులో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనలో పాల్గొన్నారు. బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించడంతో పాఠాలు సులువుగా అర్థమవుతాయన్నారు. చార్ట్‌తో కలర్‌ఫుల్ బాక్స్‌లు, కార్డులతో జంతువులు, వృత్తులు, పండ్లు, కూరగాయాలు, మాస్క్‌లతో అర్థవంతంగా పాఠాలు చెప్పాలని సూచనలు ఇచ్చారు.

పందుల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలి

బేస్తవారిపేట: బేస్తవారిపేటలో విచ్చల విడిగా పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, పందుల పెంపకందారులు జబ్బు చేసిన, వైరస్ సోకిన పందులను ఈ మధ్య కాలంలో దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి బేస్తవారిపేటలో వదలడంతో రోగాలు వస్తున్నాయని ఏపీ గిరిజన సంఘాల జేఏసీ మెంబర్ అన్నగాని సుధాకర్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ పార్వతికి పందుల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కడప జిల్లా నుంచి వచ్చిన కొందరు వీధుల్లో పందులను వదిలినట్లు తెలిపారు. పందులతో పట్టణ ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

ఓడీఎఫ్ పంచాయతీల పరిశీలన



తుమ్మలచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ తోట చందన

తర్లుపాడు: మండలంలోని ఓడీఎఫ్ పంచాయతీలను మార్కాపురం ఎంపీడీఓ, ఓడీఎఫ్ ప్రత్యేక అధికారి తోట చందన సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా గానుగపెంట, తుమ్మలచెరువు, తాడివారిపల్లి పంచాయతీల్లోని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ భవనాల్లో మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ఘన, ద్రవ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతపై సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మార్కాపురం ఏపీఎం రమేష్‌బాబు, శేషాద్రినాయుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పొదిలి: పట్టణంలోని బంగారం దుకాణాల వ్యాపారులు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోటయ్య సూచించారు. సోమవారం స్థానిక బంగారం దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి ఎస్సై వివరించారు. దుకాణాల వద్ద, పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

యువకుడి మిస్సింగ్‌పై కేసు నమోదు



అనిల్‌కుమార్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముండే కె.అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. అనిల్‌కుమార్ గతంలో మీ సేవ కేంద్రం నిర్వాహకునిగా, ఉపాధి హామీ పథకంలో టీఏగా పనిచేశారు. ఆకస్మాత్తుగా కనిపించకపోవడంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మార్కాపురం రూరల్: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో పలువురికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని తిప్పాయపాలెం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. బేస్తవారపేట నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న కారు తిప్పాయపాలెం సమీపంలో అదుపుతప్పి పొలాల్లో బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాచర్ల మండలం చోళ్లవీడు సర్పంచ్ గోతం వెంకట నారాయణ అంబులెన్స్‌లో మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.